సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం, పట్నాల మొక్కులు చెల్లించుకున్నారు. బద్దిపోచమ్మ కాలనీ భక్తులతో రద్దీగా మారింది.



రాజన్న సేవలో ప్రిన్సిపల్ డైరెక్టర్

వేములవాడ: రాజన్నను మంగళవారం ప్రిన్సిపల్ డైరెక్టర్ సెంట్రల్ ఆడిట్ అనింద్య దాస్ గుప్తా దంపతులు దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
39.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

ఆకలిగొన్న వానికి కడుపు నింపడం అత్యుత్తమ దానం
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6.35	గురు 4.35

రంజాన్ వేళలు

వ్యవసాయాభివృద్ధికి బాటలు

- జిల్లెల్ల వద్ద వ్యవసాయ కళాశాల
- నేడు ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి
- హాజరవుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- 35 ఎకరాల్లో రూ.69.30కోట్లతో నిర్మాణం



స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి



జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాల

సిరిసిల్ల: ఎండిన చెరువులు.. ఇసుక తేలిన వాగులు.. నెర్రలుచూపిన భూములు.. ఉపాధి లేక ముంబయి, భీవండి వలసలు.. నేతన్నల ఆకలిచావులు.. దశాబ్దం క్రితం సిరిసిల్ల మెట్టప్రాంతంలో నిత్యం కనిపించే దృశ్యాలు. ఇప్పుడు జిల్లా ముఖచిత్రం మారింది. గోదావరి జలాలు జిల్లాకు చేరాయి. ఏడాది పొడవునా నీటితో మధ్యమానేరు, అనంతగిరి, ఎగువమానేరు, మూలవాగు ప్రాజెక్టులతో మెట్టప్రాంతం పంటలతో కళకళలాడుతోంది. పెరిగిన వ్యవసాయ విస్తీర్ణంతో జిల్లా నేడు జలసిరుల ఖిల్లాగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద 35 ఎకరాల్లో రూ.69.30 కోట్లతో నిర్మించారు. సర్దాపూర్ వద్ద వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటైన విషయం తెలిసిందే. వ్యవసాయ కళాశాల ఏర్పాటుతో సాగురంగంలో పరిశోధనలకు, వ్యవసాయ చదువులకు బాటలు పడుతున్నాయి.

రాష్ట్రంలో ఆరో వ్యవసాయ కళాశాల

రాష్ట్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరో వ్యవసాయ కళాశాలను తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద సిద్దిపేట ప్రధాన రహదారిపై నిర్మించారు. 2018 ఆగస్టు 9వ తేదీన ఈ కళాశాలకు శంకుస్థాపన చేశారు. వ్యవసాయ కాలేజీలో బీఎస్సీ(అగ్రికల్చర్) నాలుగేళ్ల డిగ్రీ కోర్సు అందుబాటులో ఉంది. సాగులో వస్తున్న మార్పులు, వ్యవస్థాపక సామర్థ్యాలతో రైతులు, పరిశ్రమల అవసరాలను తీర్చే రీతిలో వ్యవసాయ పరిశోధనలు, బోధనలు సాగుతుంది. వ్యవసాయశాస్త్రం, జన్యుశాస్త్రం, మొక్కల పెంపకం, మృత్తికశాస్త్రం, వ్యవసాయ రసాయనశాస్త్రం, కీటకశాస్త్రం, హార్టికల్చర్, వ్యవసాయ ఇంజినీరింగ్, మైక్రో బయోలజీ, వ్యవసాయ విస్తరణ వంటి విభాగాలు ఉన్నాయి. జిల్లాలో భూసారానికి అనువైన వ్యవసాయ వంగడాల నిర్ధారణ, పరిశోధనలతో శాస్త్రీయ అంశాలు జిల్లా రైతాంగానికి దరిచేరనున్నాయి. అధిక దిగుబడులు సాధించేందుకు, ఆధునిక విధానాలు అనుసరించేందుకు, జలవనరులను సమర్థంగా వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

ఆధునిక సముదాయం

వ్యవసాయ కళాశాల సముదాయాన్ని ఆధునిక హంగులతో నిర్మించారు. 16 ఎకరాల్లో జీ ప్లస్ 2 విధానంలో 2.60 లక్షల చదరపు విస్తీర్ణంలో కళాశాల భవనం, విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతులు, 19 ఎకరాల్లో వ్యవసాయ పరిశోధనక్షేత్రం, ఫాంలాండ్స్‌ను ఏర్పాటు చేశారు. ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, ప్రయోగశాల, సెమినార్ రూమ్, అధ్యాపకుల గదులు, అసోసియేట్ డీన్‌చాంబర్, ఆధునిక లైబ్రరీని నిర్మించారు. వ్యవసాయ కళాశాలను అత్యాధునిక హంగులతో నిర్మించారు.

ఏర్పాట్లు పర్యవేక్షించిన అధికారులు

కళాశాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా అధికారులు మంగళవారం పర్యవేక్షించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్ పరిశీలించారు. కళాశాల వద్ద హెలీప్యాడ్‌ను, సభాస్థలిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన మార్పులు సూచించారు. భోజన ఏర్పాట్లు, వీఐపీ గ్యాలరీ పరిశీలించారు. ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌రెడ్డి, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీసీవో బుద్ధనాయుడు, స్థానిక సర్పంచ్ మాట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రారంభోత్సవం

జిల్లెల్ల వ్యవసాయ కళాశాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం ప్రారంభిస్తారు. విశిష్ట అతిథిగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నారు.

ఏర్పాట్లు పరిశీలన



జిల్లెల్లలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని వ్యవసాయ కళాశాలలో ఏర్పాట్లను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. కళాశాలను బుధవారం మంత్రి కేటీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పడిగెల మానస, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు ఉన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ శ్వేతామహంతి



నేరెళ్ల పీహెచ్‌సీ పరిశీలిస్తున్న శ్వేతా మహంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల)/వేములవాడఅర్బన్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆరోగ్య మహిళ' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ శ్వేతా మహంతి కోరారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల పీహెచ్‌సీని, వేములవాడ ఏరియా ఆస్పత్రిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన మహిళలతో మాట్లాడారు. రిపోర్టులను పరిశీలించి వైద్యాధికారులకు సూచనలు చేశారు. వీఐఏ పరీక్షలను సాధ్యమైనంత ఎక్కువ మందికి చేయాలన్నారు. ఒబేసిటీ, రక్త, మూత్ర, క్యాన్సర్, న్యూట్రీషియన్ వంటి పరీక్షలను స్థానిక ఆసుపత్రిలో చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు, వైద్య పరీక్షలు చేయించుకోలేని స్థితిలో ఉన్న మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, ఉప వైద్యాధికారి రజిత, జిల్లా ఆసుపత్రి సూపరింటిండెంట్ మురళీధర్‌రావు పాల్గొన్నారు.

రూ.30లక్షలు.. రివార్డులు

కేంద్ర ఆరోగ్యశాఖ చేపట్టిన హెల్త్‌మిషన్‌కు ఏరియా ఆస్పత్రి ఎంపికైతే ప్రశంసాపత్రంతోపాటు రూ.30 లక్షల రివార్డు అందుతుందని కేంద్ర బృందం సభ్యులు తెలిపారు. సోమవారం ఆస్పత్రిని పరిశీలించారు. హెల్త్‌మిషన్ లక్ష్యలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మౌసుమి సర్కార్, అంజు కుష్వహ రెండు రోజులపాటు పూర్తిగా తనిఖీలు చేయనున్నారు. ఆసుపత్రి ఎంపికైతే పత్రాన్ని అందజేయడమే కాకుండా సుమారుగా రూ. 30 లక్షల రివార్డును కూడా అందజేయనున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు, వైద్యులు అనిల్‌కుమార్, సంతోష్‌చారి, వెంకట్, నవీన్, దీప్తి, చైతన్యసుధా, జ్యోతి, నాగరాజు తదితరులు ఉన్నారు.

పూలే ఆశయ సాధనే అసలైన నివాళి



సిరిసిల్లటౌన్: మహాత్మా జ్యోతిబాపూలే నవతరానికి ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనే అసలైన నివాళి అని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్, జెడ్పీ కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అణగారిన వర్గాల హక్కుల సాధనకు, అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. సామాజిక న్యాయం పేరిట ఉద్యమాలు నిర్వహించి జనచైతన్యానికి దోహదం చేశారన్నారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ గూడూరు ప్రవీణ్, జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం, కలెక్టరేట్ పాలనాధికారి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నిరుద్యోగులకు న్యాయం దక్కాలి



టీ–సేవ్ లోగో ఆవిష్కరిస్తున్న రాము

సిరిసిల్లటౌన్: నిరుద్యోగులకు న్యాయం దక్కాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము కోరారు. పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన టీ–సేవ్ లోగోను మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. నిరుద్యోగులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు మ్యాన లక్ష్మీనారాయణ, వంగరి అనిల్, పూర్మాణి కరుణాకర్‌రెడ్డి, ఆనంద్, శ్రీధర్, రాజ్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొడతాం



దీక్షలో మాట్లాడుతున్న రాచమల్లు సిద్దేశ్వర్

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేస్తున్న రాజకీయ కుట్రలను ప్రజా ఆశీర్వాదంతో తిప్పికొడతామని కాంగ్రెస్ పార్టీ రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచమల్లు సిద్దేశ్వర్ అన్నారు. సిరిసిల్లలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అదాని, అంబాని వంటి కార్పొరేట్లకు ప్రధాని నరేంద్రమోదీ కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామునీ వనిత, ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు, సంగీతం శ్రీనాథ్, జెడ్పీటీసీ నాగంకుమార్, వకులాభరణం శ్రీనివాస్, దొమ్మాటి నర్సయ్య పాల్గొన్నారు.

అక్రమ కేసులతో ఉద్యమాలు ఆపలేరు



మాట్లాడుతున్న ఝాన్సీ

సిరిసిల్లఅర్బన్: విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఉద్యమాలను ఆపలేరని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లికేజీ, విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్, జిల్లా కన్వీనర్ నాగరాజుపై అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్నప్పుడల్లా ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలుపై ప్రశ్నిస్తున్న వారిపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థి నాయకులపై కేసులు పెట్టడం మానుకోకుంటే జిల్లాలో తిరగకుండా చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్స్ మల్యాల రాకేశ్, కోడి అజయ్, ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్ సామనపల్లి ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు, కార్తీక్, మధు ఉన్నారు.

నేడు రాజన్న హుండీ ఆదాయం లెక్కింపు

వేములవాడ: రాజన్న హుండీ ఆదాయాన్ని స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో ఏఈవోలు కీలకం

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ధాన్యం కొనుగోళ్లలో వ్యవసాయ విస్తరణాధికారులదే (ఏఈవో) కీలకమైన పాత్ర అని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామన్నారు. జిల్లాలో 259 కొనుగోలు కేంద్రాలను ధాన్యం రాకను బట్టి ప్రారంభించాలని సూచించారు. అవసరం మేరకు గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,060, కామన్ రకానికి రూ.2,040గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ధాన్యం రవాణాకు 300 లారీలు అందుబాటులో ఉంచాలని, మిల్లర్లు వేగంగా దించుకునేలా హమాలీలను ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సీఎమ్మార్ అందించడంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, మైచర్ మిషన్స్, ప్యాడీ క్లీనర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌రెడ్డి, డీసీవో బుద్ధనాయుడు, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, జిల్లా రవాణాశాఖ అధికారి వై.కొండల్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, రవాణా కాంట్రాక్టర్లు, రైస్‌మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సభకు ఏర్పాట్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉద్యమ పార్టీ రాజకీయపార్టీగా అవతరించి.. బీఆర్‌ఎస్‌గా నామకరణం చేసుకున్న తర్వాత సిరిసిల్ల నియోజకవర్గంలో తొలి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం మద్దికుంట మెట్టు వద్ద బీఆర్‌ఎస్ ఆత్మీయ బహిరంగ సభ ప్రాంగణాన్ని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆత్మీయ సభకు భారీగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులతో మంత్రి కేటీఆర్ గ్రామాల వారీగా ప్రత్యేకంగా మాట్లాడుతారని తెలిపారు. తొలిదశ సమ్మేళనానికి 5 వేల మంది ఆత్మీయులు హాజరవుతారని చెప్పారు. టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, అక్కరాజు శ్రీనివాస్, సురేందర్ రావు, సర్వర్, నర్సింహారెడ్డి, భరత్, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్ తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తోట ఆగయ్య, కొండూరి రవీందర్‌రావు

రూ.12 కోట్లతో గుడి చెరువు సుందరీకరణ

వేములవాడ: రాజన్న గుడి చెరువు బండ్‌ను రూ.12 కోట్లతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆదేశించారు. హైదరాబాద్‌లోని బేగంపేట వీటీడీఏ కార్యాలయంలో మంగళవారం వీటీడీఏ వైస్‌చైర్మన్ పురుషోత్తంరెడ్డి, టూరిజం ఎండీ మనోహర్‌రావు, రాష్ట్ర దేవాదాయ శాఖ ఆర్కిటెక్ ముక్తేశ్వర్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీధర్‌తో సమీక్షించారు. వంతెన నుంచి ఆలయం వరకు రోడ్ల విస్తరణ పూర్తి చేయాలని సూచించారు. బద్దిపోచమ్మ గుడి వద్ద బోనాల మండపం నిర్మించాలన్నారు. సీపీవో విద్యాసాగర్, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ పాల్గొన్నారు.







బై..బై..

పదోతరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష ముగియగానే విద్యార్థులు తమ స్నేహితులను కలుసుకున్నారు. పరీక్షల చివరి రోజు కావడంతో కొంత ఉద్వేగానికి లోనయ్యారు. ఉన్నత చదువుల గురించి చర్చించుకొని.. సెలవు తీసుకున్నారు. స్నేహితులకు బై..బై చెబుతూ ఇంటిబాట పట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్ పరామర్శ



కనకయ్యను పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: సిరిసిల్ల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తవుటు కనకయ్యను రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు మంగళవారం హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు. కనకయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండగా మంత్రి ఆయన్ని చూసి అందిస్తున్న వైద్యసేవలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కనకయ్యకు మెరుగైన వైద్యం అందించాలని కిమ్స్ వైద్యులకు సూచించారు. అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మంత్రి వెంట సీనియర్ జర్నలిస్ట్ టీవీ నారాయణ ఉన్నారు.

మలేషియాలో సీతారాంనాయక్ వాసి మృతి

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని సీతారాం నాయక్ తండా గ్రామానికి చెందిన బానోత్ బావుసింగ్ (48) ఈ నెల 7న మలేషియాలో అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పొట్టకూటి కోసం మలేషియా వెళ్లి మృతిచెందిన బావుసింగ్ మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి కేటీఆర్‌కు విన్నవించారు. మంత్రి చొరవతో రాష్ట్ర కార్యదర్శి మలేషియాలోని భారత దౌత్య కార్యాలయానికి లేఖ రాశారు. త్వరలోనే బావుసింగ్ మృతదేహం స్వదేశానికి చేరనున్నట్లు సమాచారం.

గుర్తుతెలియని మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు పరిసరాల్లో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు.. కొదురుపాక పాత రోడ్డు పరిసరాల్లోని ప్రాజెక్టులో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం ఉందనే సమాచారంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ వెళ్లి పరిశీలించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు 87126 56418 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఆర్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులోని లక్ష్మీ కేశవ పెరుమాండ్లస్వామి గుట్ట వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన కటుకం సాత్విక్, శివశంకర్, లింగాపూర్ సూర్యతేజ పదోతరగతి చదువుతున్నారు. మంగళవారం చివరి పరీక్ష రాసిన వారు గంభీరావుపేటలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా మండల కేంద్రం శివారులోని లక్ష్మీ కేశవ పెరుమండ్లస్వామి గుట్ట సమీపంలో వారి బైక్ అదుపుతప్పింది. ముగ్గురు గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. వైద్యం అందిస్తున్నారు. వారు ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

- నీలోజిపల్లిలో వరుస చోరీలు
- వ్యవసాయదారుల ఇళ్లపై కన్ను
- భయాందోళనలో ప్రజలు



నీలోజిపల్లి చోరీ సంఘటనలో ఎస్సై మహేందర్ విచారణ

బోయినపలి(చొప్పదండి): తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి చొరబడి అందినకాడికి ఎత్తుకెళ్తున్నారు. ప్రధానంగా వ్యవసాయకుటుంబాల ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ కుటుంబాలలో పొద్దాంత పొలాల వద్ద పనుల్లో బిజీగా ఉంటుండడంతో దొంగలకు కలిసొస్తుంది. చుట్టుపక్కల వారు సైతం పక్కింట్లో ఎవరూ ఉంటున్నారనే విషయాన్ని సైతం పట్టించుకోకపోవడంతో దొంగలకు అవకాశంగా మారింది. వరుసచోరీలతో బోయినపల్లిలో మండలంలోని పునరావాస గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు

- బోయినపల్లి మండలంలోని నీలోజిపల్లికి చెందిన తిమ్మాపురం సతీశ్ ఇంట్లో గత ఫిబ్రవరి 3న దొంగలు పడ్డారు. 8 తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లారు.
- తిమ్మాపురం గ్రామానికి చెందిన అనుముల మహేందర్ ఇంట్లో ఏప్రిల్ 9న చొరబడిన దొంగలు బీరువా పగులగొట్టి నాలుగు తులాల బంగారు నగలు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.
- మార్చి 15న అనంతపల్లికి చెందిన మల్లారెడ్డి ఇంట్లో ప్రవేశించిన ఆగంతకులు 12 తులాల బంగారం ఆభరణాలను చోరీ చేశారు.
- అనంతపల్లికి చెందిన మల్లారెడ్డి ఇంట్లో రాత్రి సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు.
- గతేడాది మార్చిలో మండలంలోని గుండన్నపల్లి అనుబంధ గ్రామం ఎన్నంపల్లిలో వేములవాడ వెళ్లే బీటీ రోడ్డును ఆనుకునే ఉన్న ఎన్నం అనంతరెడ్డి ఇంట్లో పట్టపగలు దొంగతనానికి పాల్పడ్డారు. 17 తులాల మేర బంగారు నగలు, తినగదు మాయమైంది.
- రెండు నెలల క్రితం కొదురుపాక రేణుక ఎల్లమ్మ ఆలయంలోనూ దొంగలు పడ్డారు.
- బోయినపల్లి మండలం నీలోజిపల్లి, ఎన్నంపల్లి గ్రామాల్లో రైతుల ఇళ్లలోనే చోరీలు జరుగుతున్నాయి. రైతులు పొలం పనులకు వెళ్లిన సమయంలో చోరీలు చేయడం గమనార్హం. నీలోజిపల్లి గ్రామంలో గతంలో సైతం ఇద్దరు రైతుల ఇళ్లలో పట్టపగలు ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడ్డట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఇళ్ల ముందు పెట్టుకున్న బైక్‌లు, రైతుల మోటార్లు సైతం పలు గ్రామాల్లో చోరీ జరిగిన సందర్భాలు ఉన్నాయి.

దొంగలను పట్టుకున్నా ఆగని చోరీలు

బోయినపల్లి మండలంలోని నీలోజిపల్లిలో ఫిబ్రవరి 3న జరిగిన చోరీలో ఇద్దరు దొంగలను, గతేడాది మార్చి 12న ఎన్నంపల్లి చోరీ కేసులోనూ దొంగను వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. చోరీ కేసుల్లో దొంగలను పోలీసులు పట్టుకున్నప్పటికీ దొంగతనాలు ఆగడం లేదు. వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నాం



చోరీలను అరికట్టేందుకు రాత్రి, పగలు పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. వాహనాల తనిఖీ సైతం పెంచాం. వివిధ ప్రాంతాల్లో హఠాత్తుగా తనిఖీలు చేపడుతున్నాం. అనుమానితుల ఫింగర్‌ప్రింట్స్ సేకరిస్తున్నాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి. అనుమానితుల కదలికలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలి.

– మహేందర్, బోయినపల్లి, ఎస్సై

రాజ్యాధికారంలో వాటా కల్పించాలి

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మండ్లు



మాట్లాడుతున్న పర్శ హన్మండ్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): ముదిరాజ్‌లకు జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారంలో వాటా కల్పించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు అన్నారు. మండలంలోని భీమునిమల్లారెడ్డిపేటలో మంగళవారం ముదిరాజ్ సంఘం జెండా విష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హన్మండ్లు హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముదిరాజ్‌లకు త్యాగాల చరిత్ర ఉందన్నారు. ముదిరాజ్‌ల చిరకాల కోరిక బీసీ'డి' గ్రూప్ నుంచి బీసీ'ఏ' గ్రూప్‌లోకి మార్చడమన్నారు. రాష్ట్ర జనాభాలో ముదిరాజ్‌లు 50లక్షల మంది ఉన్నారని, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ ముదిరాజ్‌ల జీవన స్థితిగతులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తే తగు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి, ముదిరాజ్ బంధు ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు మెతుకు రాజు, మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు బాలనర్సు, రాజేందర్, దేవేందర్, దేవయ్య, లక్ష్మణ్, రమేశ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై బీజేపీ సర్కారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలవాలన్న లక్ష్యంతో సీఎల్పీ నేత భట్టివిక్రమార్క పాదయాత్రలో భాగంగా మంచిర్యాలలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లా నుంచి అన్నివర్గాల ప్రజలు పెద్దెత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ సెక్రెటరీ, తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

వేములవాడ: వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా పుట్టపాక లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గంలోని మిగతా సభ్యుల ఎంపికకు మండల పరిషత్‌లోని ప్రెస్‌క్లబ్ భవనంలో మంగళవారం ఎన్నుకున్నారు. రేగుల దేవేందర్, కోళ్ల శ్రీనివాస్, రాపెల్లి శ్రీనివాస్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్, మధ్యాహ్నం భోజన విరామం తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రధాన కార్యదర్శిగా నూగూరి మహేశ్, ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా దూలం సంపత్, కోశాధికారిగా మద్దిరాల నరేశ్, కార్యవర్గ సభ్యులుగా మ్యాన శ్రీనివాస్, రేగుల సాయిబాబా, హబీబ్‌పాషా, ఉల్లెందుల మల్లేశం, తాటికొండ పవన్, నామాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

బందోబస్తు మధ్య చేపల వేట



పహారా కాస్తున్న పోలీసులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని బావుసాయిపేటలో ముదిరాజ్ కులస్తులు చేపలు పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బావుసాయిపేటలోని కొండరాయిని చెరువులో చేపలు పట్టుకునే విషయంలో గిరిజనులకు, ముదిరాజ్‌లకు కొంతకాలంగా వివాదం నలుగుతోంది. ఈ నేపథ్యంలో 15 రోజుల్లోగా చేపలు పట్టుకోవచ్చని, రక్షణగా పోలీసుల సేవలనూ వినియోగించుకోవచ్చని కోర్టు ఆదేశాలు జారీచేసింది. కోర్టు నుంచి అనుమతి రావడంతో మంగళవారం కొండరాయిని చెరువులో ముదిరాజ్ సంఘం సభ్యులు పోలీస్ బందోబస్తు మధ్య చేపలు పట్టుకున్నారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి ఎస్సైలు రమాకాంత్, రమేశ్, ప్రభాకర్ తోపాటు సుమారు 50 మంది సిబ్బంది బందోబస్తు చేపట్టారు. ముదిరాజ్ సంఘం చొక్కాల రమేశ్, సర్పంచ్ కెంద గంగాధర్, ఉపసర్పంచ్ చొక్కాల దేవరాజ్, ముదిరాజ్ కులస్తులు ఉన్నారు.

హెలీప్యాడ్ క్షేమమేనా ?

- రాత్రికి రాత్రి నిర్మిస్తున్న వైనం
- హెలీకాప్టర్‌లో రానున్న మంత్రులు



అగ్రికల్చర్ కాలేజీలో నిర్మిస్తున్న హెలీప్యాడ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో నిర్మించిన వ్యవసాయ కళాశాల ప్రారంభానికి బుధవారం మంత్రి కేటీఆర్ తోపాటు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి రానున్నారు. కాగా మంత్రులు బైరోడ్ కాకుండా హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారని అధికారులకు సమాచారం అందింది. దీంతో హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం అగ్రికల్చర్ కాలేజీ సముదాయంలో ఆగమేఘాలపై హెలీప్యాడ్ నిర్మాణం చేపట్టారు. ఉదయం హెలీకాప్టర్ రానుండగా రాత్రికి రాత్రి నిర్మించే హెలీప్యాడ్ ల్యాండింగ్‌ను తట్టుకుంటుందా?, క్షేమమేనా? అంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బాధితులను ఆదుకుంటాం



కూలిన భవనాన్ని పరిశీలిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో భవనం కూలి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డ బాధిత కుటుంబ సభ్యులను ఆదుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. కూలిన భవనాన్ని మంగళవారం పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆగయ్య మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో మాట్లాడి నష్టం అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. పందిర్ల పర్శరాములు, ఎడ్ల సందీప్ ఉన్నారు.

బాధిత విద్యార్థులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి
- మృతుడి కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): పదోతరగతి విద్యార్థి తండ్రి గుండెపోటుతో మరణించగా.. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌కు చెందిన దూలం పర్శరాములు(43) గుండెపోటుతో మృతిచెందగా.. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ మంగళవారం పరామర్శించారు. పీఆర్టీయూ సంఘం జిల్లా నాయకుడు దూలం లక్ష్మీనారాయణ సోదరుడు పర్శరాములు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పర్శరాములు ఇద్దరు కూతుళ్ల చదువుల ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. కాగా సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి మృతుడి కుటుంబానికి రూ.10వేల నగదు అందించారు. ఉపసర్పంచ్ వేముల రవీందర్‌గౌడ్, పెటా జిల్లా నాయకుడు దూలం లక్ష్మీనారాయణ, సత్యంగౌడ్, బుచ్చిరెడ్డి, శివశంకర్ ఉన్నారు.

జైలు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ



రంజిత్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న వారిని అక్రమంగా అరెస్టులు చేయడం, జైల్లో నిర్బంధించడం వంటి చర్యలతో ఉద్యమాలను ఆపలేరని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, విభాగ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజుసాగర్ అన్నారు. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన విద్యార్థి ఉద్యమనేత, రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపగా.. వారి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై రంజిత్‌కుమార్ అనేక పోరాటాలు చేశారన్నారు. విద్యాపరంగా ఉన్న సమస్యలను పరిష్కరించకుండా అరెస్టులు చేయడం సరికాదన్నారు. అనాల్డన్, వేణు, జింక అనిల్ ఉన్నారు.

గంజాయి కేసులో నిందితుడిపై పీడీయాక్టు



పీడీయాక్టు ఉత్తర్వులు అందిస్తున్న సీఐ విజ్ఞాన్‌రావు

కరీంనగర్‌క్రైం: ఆదిలాబాద్, మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రాంతం నుంచి కరీంనగర్‌కు గంజాయి తీసుకొచ్చి యువతకు అమ్ముతున్న నిందితుడిపై కరీంనగర్ రూరల్ పోలీసులు పీడీయాక్టు అమలు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన షేక్ ఉస్మాన్(44) ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి, అమ్మకాలు జరుపుతూ అరెస్టు అయ్యాడు. గతేడాది అక్టోబర్ 28 తేదీన అరెపల్లి గ్రామ శివారులో గంజాయి అమ్ముతూ పట్టుబడగా అరెస్టు చేసి జైలుకు తరలించారు. గంజాయి అమ్మకాలు చేస్తూ యువత, అమాయకుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న నిందితుడు షేక్ ఉస్మాన్‌పై మంగళవారం పీడీయాక్టు అమలు చేశారు. ఉస్మాన్‌కు కరీంనగర్ రూరల్ సీఐ విజ్ఞాన్‌రావు పీడీయాక్టు ఉత్తర్వులు అందచేసి చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ విజ్ఞాన్‌రావు, పీడీసెల్ ఇన్‌చార్జి పండరీలను సీపీ సుబ్బారాయుడు అభినందించారు.

'ఆరోగ్య మహిళ'లో 471 మందికి పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

సిరిసిల్ల: జిల్లాలో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమంలో 471 మంది మహిళలకు మంగళవారం వైద్యపరీక్షలు చేశారు. సుందరయ్యనగర్, వేములవాడ, నేరెళ్ల, తంగళ్లపల్లి ఆరోగ్య కేంద్రాల్లో 471 మది మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. నోటి క్యాన్సర్, రొమ్ము పరీక్షలు చేశారు. 220 మందికి థైరాయిడ్, 239 మందికి రక్త, 121 మంది సూక్ష్మ పోషక, 25 మందికి మూత్ర సంబంధిత పరీక్షలు చేశారు. 19 మందిలో వివిధ వ్యాధులు ఉన్నట్లు గుర్తించి వైద్య సేవలకు రెఫర్ చేశారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు పర్యవేక్షణలో జిల్లాలో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ పరీక్షలు నిర్వహిస్తారు.

వెల్‌డన్.. కలెక్టర్ అనురాగ్

- ట్విట్టర్‌లో అభినందించిన మంత్రి కేటీఆర్



సిరిసిల్ల: రాష్ట్రంలోనే తొలిసారిగా పీహెచ్‌సీల్లో ఫిజియోథెరపీ సేవలను రాజన్న సిరిసిల్ల జిల్లాలో అందుబాటులోకి తెచ్చినందుకు కలెక్టర్ అనురాగ్ జయంతిని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారు. అంతేకాకుండా దళితబంధులో దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించేలా పౌల్ట్రీఫామ్, రైస్‌మిల్లులు, పెట్రోల్‌బంక్‌లను ఏర్పాటు చేయడంపై కలెక్టర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. 'వెల్‌డన్.. కలెక్టర్ అనురాగ్' అంటూ మంగళవారం ట్వీట్ చేశారు. తంగళ్లపల్లి పీహెచ్‌సీలో మంత్రి కేటీఆర్ ఫిజియోథెరపీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించిన విషయం తెలిసిందే. మొత్తంగా జిల్లాలోని 9 పీహెచ్‌సీల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు
- ముచ్చర్లలో ముగిసిన కేటీఆర్ క్రికెట్ టోర్నీ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): క్రీడలకు, క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం ముచ్చర్లలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కేటీఆర్ క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. యువకులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. వేములవాడ జట్టు విన్నర్‌గా, ముచ్చర్ల జట్టు రన్నరప్‌గా నిలిచాయి. నిర్వాహకులు దేవేందర్, సర్పంచులు తెజావత్ రజిత, సత్యం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా మండల అభిషేకం



హోమంలో పాల్గొన్న భక్తులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో గల శ్రీసీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం మండల అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. సర్పంచు జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, జోగినిపల్లి అజిత్‌రావు, ఆలయ ట్రస్ట్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జిగా రామచంద్రం



రామచంద్రం

కోనరావుపేట(వేములవాడ): బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన బట్టు రామచంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రం బీఎస్పీలో సీనియర్ నాయకుడిగా ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేక మందిని పార్టీలోకి తీసుకవచ్చారు. అప్పటి నేరెళ్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆవిర్భావం నుంచి పార్టీకే సేవలందిస్తున్న రామచంద్రంను గుర్తించి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌కు రాష్ట్ర నాయకులు ఎనగందుల వెంకన్న తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.